సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024





అర్జీలను పరిష్కరించాలి 8లో

కలెక్టరేట్ స్పందనకు ఈవారం 365 అర్జీలు వచ్చాయి. క్షుణ్ణంగా విచారించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.



జగన్‌కే నారీలోకం మద్దతు

గొలుగొండలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ పండగలా జరిగింది. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 8లో



సాయుధ బలగాల సమీక్ష

ఆరిలోవ: అనకాపల్లి ఏఎస్పీ విజయభాస్కర్ కైలాసగిరి పోలీస్ మైదానంలో సాయుధ బలగాల వార్షిక సమీక్ష చేశారు.

విశాఖ వేదిక క్రీడా వేడుక



అందరూ ఆడాలి.. అందరికీ అవకాశమివ్వాలి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి.. గ్రామీణ స్థాయి క్రీడాకారులను సైతం ప్రోత్సహించాలి.. ఇదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందుకే సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అంచలంచెలుగా పోటీలు నిర్వహించారు. గల్లీ స్థాయి ఆటగాళ్లు, వెటరన్ క్రీడాకారులు, చిన్నప్పుడెప్పుడో ఆటలాడిన గృహిణులు.. ఇలా ఎందరో ఈ క్రీడా సంబరంలో పాలుపంచుకున్నారు. గ్రామ స్థాయిలో మొదలై, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలను పూర్తి చేసుకొని.. నాలుగు రోజులుగా రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫైనల్స్‌కు విశాఖ వేదికైంది. మంగళవారం విజేతలకు సీఎం చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరగనుంది. క్రికెట్ పోటీ ఫైనల్ మ్యాచ్‌ను ముఖ్యమంత్రి వీక్షించనుండడం ప్రత్యేక ఆకర్షణ.

- నేడు 'ఆడుదాం–ఆంధ్రా' విజేతలకు బహుమతి ప్రదానం
- క్రికెట్ ఫైనల్స్ వీక్షించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- డా.వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు

విశాఖ స్పోర్ట్స్: 'ఆడుదాం–ఆంధ్రా' రాష్ట్రస్థాయి టోర్నమెంటు ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్న నేపథ్యంలో కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఏర్పాట్లను పరిశీలించారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్ తదితర అధికారులతో కలిసి సోమవారం పీఎం పాలెంలోని డా.వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముగింపు కార్యక్రమాన్ని పండగ వాతావరణం తలపించేలా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోందని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు, సాధారణ ప్రజలకు ఆహారం, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, శాప్ నుంచి ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమిస్తున్నామని వెల్లడించారు. స్టేడియం లోపల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, వీక్షకులు వచ్చి కూర్చునేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. స్టేడియంలోపల ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు అనువుగా ప్రధాన స్టేజీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. స్టేడియం వద్ద సమావేశం అనంతరం జిల్లా అధికారులంతా మధురవాడ ఐటీ హిల్స్ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖలో రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లు జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకునే అదృష్టం కలిగినందుకు చాలా సంతోషపడుతున్నా నన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జోనల్ యువజన విభాగం ఇన్‌చార్జి శివ నందీష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

విశాఖ సిటీ: ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖకు వస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం 1500 మందితో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటోంది. డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు బందోబస్తును పలు కేటగిరీలుగా విభజించి, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క పోలీసు ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు.

- ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలకు, ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టారు.
- ఎయిర్‌పోర్ట్ వద్ద, పార్కింగ్, కాన్వాయ్, హెలిప్యాడ్, క్రికెట్ స్టేడియం వద్ద భద్రత చేపడుతున్న అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.
- నగరంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించారు.
- వీఐపీలు పాల్గొనే ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్, బాంబు స్క్వాడ్లతో నిశితంగా తనిఖీలు చేశారు.



ముస్తాబవుతున్న వైఎస్సార్ స్టేడియం



కబడ్డీలో తలపడుతున్న వైజాగ్–అనంతపురం మహిళా జట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మత్తు వదిలిస్తాం..

- గంజాయి తదితర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి
- అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా..
- విశాఖ రేంజ్ నూతన డీఐజీ విశాల్ గున్ని



విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నికి అభినందనలు తెలుపుతున్న ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, విశాఖపట్నం: నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్)పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, దానికి అనుగుణంగానే తమ పనితీరు ఉంటుందని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని చెప్పారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను నిర్మూలిస్తామని, ఏజెన్సీ ప్రాంత జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రేంజ్ పరిధిలోని 5 జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేంజ్ పరిధిలోని గల వివిధ జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి తమ శాఖలోని అన్ని విభాగాలను పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదు ఇచ్చిన వారందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకు వెళతామన్నారు. తాను అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, వార్తలు ప్రచురించే ముందు తనను లేదా ఎస్పీ స్థాయి అధికారులను సంప్రదించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. సోషల్ మీడియాలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అవాస్తవాలను వార్తలుగా ప్రచురించడం రోజురోజుకు పెరుగుతోందని, ఈ కారణంగా ప్రజలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వార్త ప్రచురించే ముందు నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

తొలి పోస్టింగ్ నర్సీపట్నం ఏఎస్పీగా..

2010 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన విశాల్ గున్ని శిక్షణానంతరం నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు. 2013 నుంచి 2015 వరకు నర్సీపట్నం ఏఎస్పీగా చేసిన ఆయన పదోన్నతిపై ఓఎస్డీగా నియమితులయ్యారు. అనంతరం నెల్లూరు,, తూర్పుగోదావరి జిల్లాల ఎస్పీగా, గ్రేహౌండ్స్ ఎస్పీగా, విజయవాడ డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేశారు. విజయవాడ నుంచి పదోన్నతిపై విశాఖ రేంజ్ డీఐజీగా వచ్చారు.

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన అందరి బాధ్యత

తుమ్మపాల: సికిల్‌సెల్ ఎనీమియా (కొడవలి కణం రక్తహీనత) నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి ఎర్ర రక్తకణాల రుగ్మతల మూలంగా వచ్చే రక్తహీనతేనని తెలిపారు. ఇది జన్యుపరంగా గిరిజన సమూహాలలో ఎక్కువగా వస్తున్నట్లు నిపుణులు తెలిపారన్నారు. ఇతర సమూహాలలో కూడా వస్తున్నట్లు గుర్తించారన్నారు. ప్రతి ఒక్కరు వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్ మాట్లాడుతూ రక్తహీనతతో కళ్లు పసుపురంగుకు మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్లనొప్పులు, శ్వాస ఇబ్బందులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు.

సరైన వైద్యం, నియమబద్ధ జీవిత అలవాట్ల ద్వారా నియంత్రించవచ్చన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, కేఆర్‌సీసీ ఉప కలెక్టర్ ఎ.మహేష్, ఏటీడబ్ల్యూవో నాగ శిరీష, డిపిఒ ఆర్.శిరీషరాణి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఫార్మసిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్టుల గ్రేడ్–2 నియామకాలకు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ బి.సుజాత (విశాఖ,జోన్) నోటిఫికేషన్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 8 ఫార్మాసిస్టు గ్రేడ్–2 పోస్టులు భర్తీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఆమె తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను రేసపువాని పాలెంలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు వారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు డి.ఫార్మా/ బి.ఫార్మా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. వివరాల కోసం https@// nagendrasvast. wordpress. com వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.500, మిగిలిన కులాలకు చెందిన అభ్యర్థులు రూ.300,డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తుకు జత చేయాలన్నారు. రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ, విశాఖపట్నం పేరిట డీడీ తీయాలని డాక్టర్ సుజాత తెలియజేశారు.

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ బుధవారం నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎం.పోలినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

15న జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన

తుమ్మపాల: ఈనెల 15వ తేదీన పట్టణంలోని ఉడ్‌పేట మున్సిపల్ పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డులు పొందిన 131 ప్రదర్శనలను ఎంపిక చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఆయా ప్రదర్శనల విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులు హార్డ్, సాఫ్ట్ కాపీలతో హాజరై గురువారం ఉదయం 8 గంటలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఆరోగ్య పరిరక్షణ

- గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు వైద్య సేవలు అందాలి
- గొండుపాలెం హెల్త్ క్లినిక్‌ను పరిశీలించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం

కె.కోటపాడు: గర్భిణులు, బాలింతలు, విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు డిస్ట్రిక్ట్ పారా మెడికల్ ఆఫీసర్ లూసీ, గణాంక అధికారి రామచంద్రరావు అన్నారు. గొండుపాలెంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో సోమవారం గర్భిణులు, బాలింతలతో వీరు మాట్లాడారు. వీరికి వైద్య సిబ్బంది అందిస్తున్న ఆరోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టిక విలువలు గల ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యమని లూసీ, సూర్యనారాయణ చెప్పారు. ప్రతీ నెలా గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు చేయాలని తెలిపారు. రక్తహీనత గల గర్భిణులను హైరిస్క్ గల వారిగా గుర్తించి మెరుగైన వైద్యానికి సీహెచ్‌సీకి తీసుకువెళ్లాల్సిందిగా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు వివరించారు. అనంతరం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న హెచ్‌బీ పరీక్షల వివరాలతో పాటు రక్తశాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు అందిస్తున్న ఐరన్ మాత్రల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ నాగమణి, చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రమణ్యం, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.



గర్భిణుల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు లూసీ, రామచంద్రరావు

నేషనల్ హైవేపై సోలార్ లైట్లు

- పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు ఏర్పాటు
- ఫలించిన ఎంపీ కృషి
- హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

నక్కపల్లి : జాతీయరహదారిపై రాత్రి సమయాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే ప్రత్యేక చర్యలు చేపట్టింది. అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి ప్రత్యేక కృషితో పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు జాతీయరహదారిపై సోలార్ సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు హైవే అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే జాతీయ రహదారిపై రాత్రి సమయాల్లో సరైన లైటింగ్ సదుపాయం లేక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు దాటేవారు, రాకపోకల కోసం రోడ్డు పక్కన నిలుచునేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే హైవే అధికారులు పాయకరావుపేట, నామవరం, అడ్డురోడ్డు, యలమంచిలి, తాళ్లపాలెం, ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని నక్కపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ తదితరులు గత ఏడాది అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతికి వినతి పత్రం ఇచ్చారు. తరచూ ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో వివరాలతో పాటు, పోలీస్ శాఖనుంచి ప్రతిపాదనలు తయారు చేసి తనకు అందజేయాలని ఎంపీ సూచించడంతో గతంలో ఇక్కడ పనిచేసిన సిఐ నారాయణరావు, ఎస్ఐ శిరీషల ఆధ్వర్యంలో నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు ఎంపీకి అందజేశారు.

ఆమె ద్వారా జాతీయరహదారిపై సెంట్రల్ లైటింట్ ఏర్పాటు చేయాలంటూ నేషనల్ హైవే పీడీకి ప్రతిపాదనలు పంపించారు. దీంతో నేషనల్ హైవే అధికారులు జాతీయరహదారిపై గొడిచర్ల, ఉద్దండపురం, వేంపాడు, కాగిత, చినదొడ్డిగల్లు, న్యాయంపూడి, నక్కపల్లి, గోకులపాడు, పురుషోత్తపురం, వమ్మవరం, నర్సింగపల్లి, తదితర ప్రధాన కూడళ్లను కలుపుతూ పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు జాతీయ రహదారిపై సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. త్వరలోనే ఈ ప్రాంతాల్లో జాతీయ రహదారిపై సోలార్ లైట్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ లైటింగ్ ఏర్పాటుతో జాతీయ రహదారిపై రాత్రి సమయాల్లో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని నేషనల్ హైవే అధికారులతోపాటు పోలీసులు చెబుతున్నారు. జాతీయరహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ సత్యవతికి నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు చెబుతున్నట్టు కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, స్థానిక నాయకులు మణిరాజు, పాపారావు, తదితరులు తెలిపారు.



జాతీయరహదారిపై నామవరం వద్ద ఇప్పటికే ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్

విజయీభవ!

- ఇంటర్‌లో వంద శాతం **ఉత్తీర్ణతే లక్ష్యం**
- ప్రభుత్వ కళాశాలల్లో **జయీభవ**–సంకల్ప పేరిట ప్రత్యేక **కార్యక్రమం**
- చదువులో వెనుకబడిన **విద్యార్థులపై** ప్రత్యేక శ్రద్ధ
- ఉత్తమ ఫలితాల సాధనే **లక్ష్యం**

యలమంచిలి రూరల్: ఇంటర్మీడియ**ట్ పబ్లిక్ పరీక్షల్లో** ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా **ప్రభుత్వం ముం**దస్తు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ **కళాశాలల్లో చదువు**తున్న విద్యార్థులు ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో జయీభవ, సంకల్ప పేరిట ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచి అత్యుత్తమ ఫలితాలను సాధించడమే లక్ష్యంగా 50 రోజులపాటు అభ్యసనాభివద్ధి కార్యక్రమాన్ని రూపొందించారు. గత ఏడాది డిసెంబర్ 14వ తేదీన ప్రారంభమైన ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా పరీక్షలను నిర్వహించి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంతో విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టి, ఆత్మవిశ్వాసం పెంచి మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు తర్ఫీదునిస్తున్నారు. మార్చి 1 నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు వారిని సర్వసన్నద్ధం చేస్తున్నారు.

వ్యక్తిగత శ్రద్ధతో ప్రత్యేక తరగతులు

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 6175 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 3317, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2858 మంది ఉన్నారు. అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభించి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, సబ్జెక్టు లెక్చరర్లు వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటున్నారు. 5 నుంచి 8 మంది విద్యార్థులను ఒక అధ్యాపకునికి అప్పగించి ఆయా విద్యార్థులకు సలహాదారుగా వ్యవహరిస్తూ, తద్వారా విద్యార్థులను విజయం సాధించే దిశగా ప్రేరేపించి ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ అధ్యాపకులు విద్యార్థుల్లో నెలకొన్న భయాన్ని పోగొడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన టైం టేబుల్ ప్రకారం ఉదయం, మధ్యాహ్నం మెరుగైన బోధన, శిక్షణ అందిస్తున్నారు. ఈ నెలలో మరిన్ని అంతర్గత పరీక్షలు నిర్వహించడంతో పాటు ఇప్పటికే నిర్వహించిన నాలుగు యూనిట్ టెస్టులు, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ప్రీ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థుల ఫలితాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వెనుకబడిన వారికి సరైన మార్గనిర్దేశం చేస్తున్నారు. విద్యార్థుల పురోగతిని పునఃసమీక్షించి అప్పటికీ వెనుకబడిన విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యత గల ప్రశ్నలను చదివి రాసేలా శిక్షణనివ్వనున్నారు.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	20
హైస్కూల్ ప్లస్	04
ఏపీ మోడల్ స్కూల్స్	05
కేజీబీవీలు	20
ఏపీ సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల కళాశాలలు	08
మహాత్మా జ్యోతిబాపూలే కళాశాల	1
ప్రైవేటు కళాశాలలు	75
పరీక్ష కేంద్రాలు	38
పరీక్షలు రాయనున్న విద్యార్థులు	25,196
ఫస్టియర్	13,326
సెకండియర్	11,870



అనకాపల్లి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాయంత్రం స్టడీ క్లాసుల్లో విద్యార్థులు

ఉత్తీర్ణత మెరుగుకు చర్యలు



జయీభవ–సంకల్ప కార్యక్రమంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సబ్జెక్టు లెక్చరర్లను ఆదేశించాం. ముఖ్యంగా ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తూ ప్రథమ సంవత్సరంలో ఏవైనా బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న వారి కోసం అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులయ్యేలా కార్యాచరణ రూపొందించాం. ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఏర్పడింది.

–బి.సుజాత, డీఐఈవో, అనకాపల్లి


ఆత్మవిశ్వాసం పెరిగింది



మాకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ క్లాసులు నిర్వహిస్తున్నారు. మంచి మార్కులతో పాసయ్యేలా తర్ఫీదునిస్తున్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. మంచి ఫలితాలు సాధిస్తానన్న నమ్మకం ఏర్పడింది.

–యల్లపు సౌమ్య, ఇంటర్మీడియట్ సెకండియర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, యలమంచిలి

లెక్చరర్లు బాగా చెబుతున్నారు



ప్రత్యేక పునఃశ్చరణ తరగతుల్లో లెక్చరర్లు వ్యక్తిగత శ్రద్ధ చూపుతున్నారు. సబ్జెక్టుల వారీగా, ప్రణాళికాబద్ధంగా మాకు తర్ఫీదునిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లోలాగ ప్రభుత్వ కళాశాలల్లో కూడా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకునేలా ప్రభుత్వం స్పెషల్ రివిజన్ క్లాసులు నిర్వహించడం మాకెంతో మేలు చేసింది.

–మంజేటి యుగంధర్ సాయి, సెకండియర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, యలమంచిలి

సీఎం జగన్‌కే నారీలోకం మద్దతు పలకాలి



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్



వేలాదిగా తరలివచ్చిన మహిళలు

- నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత

గొలుగొండ: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఇటువంటి నిజాయతీ కలిగిన వ్యక్తికే నారీలోకం మద్దతు తెలపాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. సోమవారం సాయంత్రం గొలుగొండలో వైఎస్సార్ ఆసరా పథకం చెక్కును పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ లబ్ధి పొందిన మహిళల ఆర్థికాభివృద్ధితో దేశంలోనే ఆదర్శంగా నిలిచామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో అమ్మఒడి పథకం వల్ల రూ.148 కోట్లు, రైతు భరోసా వల్ల రూ.168 కోట్లు, వైఎస్సార్ చేయూత వల్ల రూ.128 కోట్లు ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. గొలుగొండ మండలంలో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.7.18 కోట్లు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశామన్నారు. ఇటువంటి ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలిపించుకోవాలన్నారు. ప్రతిపక్షాలన్నీ పొత్తులతో ఒక్కటై ఎన్నికలకు వస్తున్నాయని, వాటిని మోసాలను తిప్పికొట్టి ప్రజలు మేలుకోరే సీఎం జగన్‌కే మద్దతు తెలపాలని కోరారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, వైస్ ఎంపీపీలు సుర్ల బాబ్జి, జక్కు నాగమణి, సర్పంచ్ కసిపల్లి బుజ్జి, ఎంపీటీసీ చినపాప, ఏపీఎం మంగ పాల్గొన్నారు.

జగన్‌బాబు ఇచ్చిన డబ్బులతో దర్జాగా బతుకుతున్నాం



'రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలకు పెద్ద కొడుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డే. నవమాసాలు మోసి కన్నవారు నెలకు ఐదొందలు అడిగితే లేవని చెబుతున్నారు. ఈ రోజు పింఛన్లు, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసాతో ఎవరిపైనా ఆధారపడలేదు. జగన్‌బాబు ఇచ్చిన డబ్బులతో దర్జాగా బతుకుతున్నాం. తీర్థయాత్రలు చేస్తున్నాం. పేదలంతా ఎంతో సంతోషంగా ఉన్నారు. ఇటువంటి పెద్ద కొడుకు మరలా సీఎం కావాలి'. అంటూ గొలుగొండలో జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం కార్యక్రమంలో పుత్తడిగైరంపేటకు చెందిన నిరుపేద మహిళా ఉద్వేగంతో వ్యాఖ్యానించింది.

ప్రధాన సమస్యలన్నీ పరిష్కారం

- నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నిధుల విడుదల
- 22న కొక్కిరాపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభం
- యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి రూరల్: నియోజకవర్గంలో ప్రధాన సమస్యలన్నింటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పరిష్కారం లభించిందని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు స్పష్టం చేశారు. పట్టణవాసులు 15 ఏళ్ల సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న కొక్కిరాపల్లి పై వంతెన నిర్మాణ పనులు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఈ నెల 22న దాన్ని ప్రారంభిస్తామన్నారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009 ఫిబ్రవరిలో తాను ఎమ్మెల్యేగా శంకుస్థాపన చేసి, మొదలు పెట్టిన కొక్కిరాపల్లి పై వంతెన పనులను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.10 కోట్లతో పూర్తి చేయించినట్టు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టరుకు రూ.2 కోట్ల మేర బకాయిలు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. తమ ప్రభుత్వంలో వాటిని ఇప్పించానన్నారు. ప్రస్తుతం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు రూ.5 కోట్లకు పైగా బిల్లులు మంజూరు కావడంలో కాస్త జాప్యం చోటు చేసుకుందన్నారు. దీంతో అతడి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాను ఆర్థికంగా సహాయం చేసి పనులు యుద్ధప్రాతిపదికన జరిగేలా చూస్తున్నానన్నారు. పై వంతెన పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాను ప్రత్యక్షంగా అనుభవిస్తున్నానన్నారు. అందుకే త్వరితగతిన పూర్తి చేయించాలను పట్టుదలతో కృషి చేశానని చెప్పారు. తుది దశకు చేరుకున్న వంతెన పనులు పూర్తికాగానే ఈ నెల 22న ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్అండ్‌బీ శాఖ మంత్రిని ఆహ్వానించామన్నారు. ఇక పట్టణంలో రూ.2 కోట్లతో రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులు చకచకా జరుగుతున్నాయని మరో 20 రోజుల్లో పూర్తవుతాయన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు మరో ప్రధాన సమస్యగా ఉన్న అచ్యుతాపురం – అనకాపల్లి రహదారి పనులకు రూ.6.5 కోట్లతో 14 కిలోమీటర్ల మేర నిర్మిస్తామన్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ రహదారి సామర్థ్యం 15 టన్నులు కాగా భారీ వాహనాల రాకపోకల కారణంగా స్వల్ప కాలంలోనే దెబ్బతింటోందని, ఈసారి వాటి ప్రవేశం లేకుండా ఇనుప రాడ్లను నిర్ణీత ఎత్తులో బారికేడ్లను ఏర్పాటు చేయడానికి అన్ని పార్టీల నాయకులు నిర్ణయించారన్నారు. కేవలం చిన్న లగేజీ వాహనాలు, ప్రజారవాణా వాహనాలను అనుమతిస్తామన్నారు. రాంబిల్లి మండలంలో నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఏవోబీ) ఏర్పాటుతో కొత్తపట్నం, వాడనర్సాపురం గ్రామాల మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడానికి కుదరడంలేదని, దీంతో వారందరికీ ప్రభుత్వం నుంచి జీవన భృతి మంజూరు చేయించామన్నారు. రేషన్ కార్డులున్న 2,211 మందికి జీవన భృతి ప్యాకేజీ కింద ఒక్కొక్కరికి రూ.1.30 లక్షల చొప్పున మొత్తం రూ.28.74 కోట్లు వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ప్రధాన సమస్యలన్నింటినీ గత టీడీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుత తమ ప్రభుత్వం సహృదయంతో ప్రజల బాధలు తొలగించడానికి కృషి చేసిందన్నారు. దీనికి సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కొల్లి త్రినాథ్, దూది నర్సింహమూర్తి, శానాపతి రాము (ఏటికొప్పాక), వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల పరిశీలన

కొక్కిరాపల్లి రైల్వే గేటు పైవంతెన పనులను ఎమ్మెల్యే కన్నబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. తుది దశకు చేరుకున్న పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయో యలమంచిలి రోడ్లు, భవనాల శాఖ డీఈఈ విద్యాసాగర్, ఏఈఈ సత్యవాణిలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పూర్తి కావాల్సిన అప్రోచ్ రోడ్డు (బీటీ), రెండోవైపు కాంక్రీటు పనుల గురించి అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇది చాలా ప్రతిష్టాత్మకమైనదని, ఎట్టి పరిస్థితుల్లోను ఈ నెల 22వ తేదీకల్లా పూర్తి చేయాలన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల ఎంపికలకు సన్నాహాలు

తుమ్మపాల: చెన్నై జెప్పిఆర్ యూనివర్సిటీలో ఈనెల 23 నుంచి 25 వరకు 14వ జూనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శిలపరశెట్టి బాబి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా వచ్చే నెల 9, 10 తేదీల్లో కర్ణాటక రాష్ట్రం దావనగిరిలో జరిగే సౌతిండియా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో 55, 100 కేజీల పైబడిన కేటగిరీ వరకు పోటీలు ఉంటాయన్నారు. ప్రతి కేటగిరీకి రూ.50 వేల చొప్పున, చాంపియన్ విన్నర్, రన్నర్, బెస్ట్ ఫోజర్లకు రూ.1.75 లక్షల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. రాష్ట్రం తరఫున పాల్గొనే జిల్లా జట్టుకు బాడీ బిల్డర్ల ఎంపిక ఈ నెల 20వ తేదీలోపు నిర్వహిస్తామన్నారు. 21 ఏళ్ల లోపు బాడీ బిల్డర్లు తమ జన్మదిన ధ్రువపత్రంతో హాజరు కావాలన్నారు. వివరాలకు 8465077799కు సంప్రదించాలన్నారు.

రథసప్తమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక: అనకాపల్లిలోని సుంకరమెట్ట జంక్షన్‌లోని సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 16న జరగనున్న రథసప్తమి వేడుకల పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆవిష్కరించారు. మునగపాకలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి, విజయవంతం చేయాలని కోరారు. కోలాటాల ప్రదర్శన, అన్నమయ్య గీతాలాపన జరుగుతాయన్నారు.

అర్జీలను క్షుణ్ణంగా విచారించి పరిష్కరించాలి



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఉప కలెక్టర్ మహేష్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం
- 'జగనన్నకు చెబుదాం'కు 365 అర్జీలు

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం(స్పందన)లో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా విచారించి పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయనతోపాటు ఉప కలెక్టర్ ఎ.మహేష్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ప్రజలు తీసుకొస్తున్న సమస్యలపై స్పందించి పరిష్కరించడం ద్వారా అర్జీలు పునరావృత సంఖ్యను తగ్గించగలమన్నారు. స్పందన అర్జీల నమోదు నాటి నుంచి నిర్ణీత సమయంలో ఆయా శాఖ అధికారులు నేరుగా విచారణ చేసి అర్జీదారుడిని సంతృప్తి పరచాలన్నారు. వినతుల తిరస్కరణకు కారణాలను స్పష్టంగా తెలపాలన్నారు. ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాల లబ్ధిపై ఎక్కువగా వినతులు వస్తున్న నేపథ్యంలో రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అర్జీదారులకు 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని ఎప్పటికప్పుడు ఎంపిక చేసి వాటిని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. మొత్తం 365 అర్జీలు నమోదైనట్లు డీఆర్వో బి. దయానిధి తెలిపారు. డీఆర్డీఏ పీడీ శచీదేవి, భూవిభాగం సర్వే ఏడీ ఎస్.గోపాలరాజు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులు వేచి ఉండకుండా..

- అర్జీదారులు గంటల పాటు వేచి ఉండకుండా కలెక్టరేట్ ప్రాంగణంలో 12 శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆయా చోట్ల అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను ఫిర్యాదు రూపంలో రాసేందుకు సమీప గ్రామాల సచివాలయ సిబ్బందికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.

హాస్టళ్లలో సమస్యలపై ఫిర్యాదు

ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలుపై వెంటనే చర్యలు చేపట్టాలని, ఇటీవల నర్సీపట్నం హాస్టల్‌లో విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన నేపథ్యంలో నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూవో, గొలుగొండ ఎలక్ట్రికల్ ఏఈలను తక్షణమే సస్పెండ్ చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు, రేబాక మధుబాబు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాతవరం మండలంలో మరో మూడు హాస్టళ్లలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. మరుగుదొడ్లు పనిచేయడం లేదని, పర్యవేక్షణ లేమితోపాటు బాధ్యతారహితంగా మెలుగుతున్న అధికారులపై చర్యలు చేపట్టకపోతే పిల్లలు దయనీయమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దళిత సేవా పరిరక్షణ జిల్లా నాయకులు యాదగిరి దాసు, మల్లవరపు సతీష్‌కుమార్, బీలా శివగణేష్ పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 36 అర్జీలు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 36 అర్జీలు వచ్చాయి. చట్ట పరిధిలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని దిగువ స్థాయి అధికారులకు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. ఎక్కువగా ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ వంటి వాటిపై అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

రుద్రభూమిలో ఆధ్యాత్మిక సందడి

- మల్లాంలో శివుడు, సత్యహరిశ్చంద్ర విగ్రహాల ప్రతిష్ట



శివుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రుద్రభూమిలో ఏర్పాటు చేసిన సత్య హరిశ్చంద్ర విగ్రహం

బుచ్చెయ్యపేట: శ్మశాన వాటిక అంటేనే.. బూడిద కుప్పలు.. శవాల దిబ్బలు.. పేరుకుపోయిన పిచ్చి మొక్కలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. ఇందుకు భిన్నంగా మండలంలో మల్లాం గ్రామ శ్మశాన వాటికకు ఆధ్యాత్మిక సొబగులద్దారు. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన శివుడు, సత్య హరిశ్చంద్ర విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత భజనలు, తప్పెటగుళ్లు, చిడతల మధ్యన వీటిని ఊరేగించి అనంతరం రుద్రభూమి లో ప్రతిష్ఠించారు. పెద మల్లాం, చిన మల్లాం గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రైలు పట్టాలపై మృతదేహం

తుమ్మపాల: అనకాపల్లి నుంచి తాడి రైల్వే స్టేషన్ మధ్య పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు దువ్వాడ జీఆర్‌పీ ఎస్సై శాంతారామ్ సోమవారం తెలిపారు. తాడి సమీపంలో రైల్వే ట్రాక్ రెండో ప్లాట్‌ఫాం మీద 25 నుంచి 30 ఏళ్ల వయసు గల యువకుడు మరణించినట్లు గుర్తించామన్నారు. మృతదేహం వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు, ఆనవాళ్లు లేనందున ఆచూకీ తెలియరావడం లేదన్నారు. ప్రమాదంలో కుడి కాలు, చెయ్యి శరీరం నుంచి తెగిపడ్డాయని, తలపై తీవ్ర గాయమైందని తెలిపారు. 5.7 అడుగుల ఎత్తు, సిమెంట్ రంగు టీ షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి తరలించినట్లు తెలిపారు. మృతుడి సంబంధికులు రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

పోరస్ కంపెనీలో కార్మికుడు మృతి



చిన అప్పారావు (ఫైల్)

రాంబిల్లి: పోరస్ ల్యాబ్స్ కంపెనీలో సోమవారం కార్మికుడు మృతి చెందినట్లు సీఐ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని వెంకటాపురానికి చెందిన జి. చిన అప్పారావు(49) ఆస్తమా సమస్యతో బాధపడుతున్నాడు. ఉదయం ఎ. షిఫ్టులో ఉండగా అతడు ఉక్కిరిబిక్కిరై వెంటనే మాత్ర వేసుకునేందుకు పని ప్రదేశం నుంచి క్యాంటీన్‌కు వస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడని తెలిపారు. వెంటనే సిబ్బంది అచ్యుతాపురం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. దీనిపై మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు కుటుంబానికి రూ.50 లక్షల సాయం చేసి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు.

భార్య మందలించడంతో భర్త ఆత్మహత్య

నర్సీపట్నం: మద్యానికి బానిసైన భర్తను భార్య మందలించడంతో క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పాతబయపురెడ్డిపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ కాంతికుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనిమిరెడ్డి సత్తిబాబు(62) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ బాధ్యతలు చూసే పెద్దవి రోజూ తాగుతుంటే ఎలా అని భార్య మందలించింది. అదే సమయంలో చెట్టుపల్లిలో గౌరీపరమేశ్వరుల పండగకు ఆదివారం రాత్రి పిల్లలతో కలిసి ఆమె బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అతడు పూటుగా మద్యం సేవించాడు. ఆ మత్తులో గడ్డి మందును సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటినా ఇంటికి చేరుకుని 108 వాహనంలో సత్తిబాబును ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో డాక్టర్లు సిఫార్సు మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



డ్రమ్ములు, పాత్రలతో ఎస్ఐ రమేష్, సిబ్బంది

కె.కోటపాడు: మండలంలో కొత్త అగ్రహారం శివారులో సారా స్థావరంపై ఎ.కోడూరు పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఇక్కడ గెడ్డ ప్రాంతంలో సారా తయారీకి డ్రమ్ములు, వంట పాత్రల్లో సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలు చట్టరీత్యా నేరమని ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీను, లక్ష్మణ, ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ రహదారికి భూమిపూజ



నూకాంబిక అమ్మవారి ఆలయానికి సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం

కశింకోట: కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద రూ.5 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు సోమవారం భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చిన నిధులతో దీన్ని నిర్మిస్తున్నట్టు బుల్లిబాబు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు తలారి దొరబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జనరిక్ మందుల దుకాణం పనులు



జనరిక్ మందుల భవనం నిర్మాణ పనులు

అనకాపల్లి: ప్రజా రవాణాశాఖ(ఆర్టీసీ) ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారం సమీపంలో జనరిక్ మందుల దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ అధికారులు దుకాణాన్ని నిర్మిస్తున్నారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. కాంప్లెక్స్ ఆవరణలో తక్కువ ధరకు జనరిక్ మందుల షాప్‌ను ఏర్పాటు చేస్తే రోగులకు ఎంతగానో ఉపయోగపడనుంది. సుమారుగా రూ.లక్ష నిధులతో దుకాణాన్ని మరో రెండు మాసాల్లో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

నేడు విజయ వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేటలో మంగళవారం శ్రీ విజయ వినాయక స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు తెల్లవారుజామునుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి పలకా రాము సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 11,329 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
స్పెషల్ రకం	3,880	4,600
మొదటి రకం	3,460	4,060
రెండో రకం	3,380	3,670
మూడోరకం	3,240	3,490

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
ఈగల్	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
లాల్‌సలామ్	: పర్డిసాయి
గేమ్ ఆన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-1 యూనిట్లు, ఓ పాజిటివ్-11 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



కుంచంగి-వెంకుపాలెం రహదారి

- రూ.3.55 కోట్లతో కుంచంగి గ్రామం అభివృద్ధి
- గ్రామంలో గ్రామ సచివాయం, ఆర్‌బీకే, విలేజ్ వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- కుంచంగి గ్రామం నుంచి వెంకుపాలెం గ్రామానికి తారురోడ్డు నిర్మాణం





సచివాలయం జగనన్న గృహాలు రిజిస్ట్రేషన్లు



కుంచంగి మూలపేట వీధిలో బోర్ వద్ద గ్రామస్తులు

కుంచంగి...రూపుమారి...!

అనకాపల్లి: పట్టణాలను తలపించే విధంగా పల్లెలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి. మండలంలో 76 సంవత్సరాల స్వాతంత్య్ర పాలనలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపించింది. మండలంలో కుంచంగి గ్రామాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3.55 కోట్లతో అభివృద్ధి చేశారు. అనకాపల్లి పట్టణానికి 11 కిలోమీటర్ల దూరంలో 3519 మంది జనాభా గల కుంచంగి గ్రామంలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, సీసీ డ్రైనేజీ, నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాలు, బీటీ రోడ్డు, వర్మికంపోస్టు యార్డు, ఇంటింటి కుళాయి. వ్యవసాయ బోర్లు, అమూల్ పాలకేంద్రం, అర్హులైన లబ్ధిదారులకు జగనన్న గృహాలు వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. గత ప్రభుత్వ పాలనలో గ్రామం నుంచి పట్టణానికి రావాలంటే గోతుల దారిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. జగనన్న పాలనలో రహదారుల అభివృద్ధి జరగడంతో గ్రామం నుంచి అనకాపల్లి పట్టణానికి సుమారుగా 15 నిమిషాల్లో చేరుకోవడం జరుగుతుంది. గ్రామం నుంచి వెంకుపాలెం కొత్త తారురోడ్డు రహదారి నిర్మించడడంతో రవాణా సౌకర్యం ఎంతగానో మెరుగు పడిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇవిగో అభివృద్ధి పనులు

- కుంచంగి వెంకుపాలెం సుమారుగా 5.5 కిలోమీటర్ల రహదారిని రూ.కోటి నిధులతో అభివృద్ధి చేశారు.
- వర్మికంపోస్టు యార్డును రూ.5.50 లక్షల నిధులతో నిర్మించారు.
- గ్రామంలో ఇంటింటి తాగునీటి కుళాయిలు 600 ఇచ్చారు.
- కుంచంగి గ్రామ పరిధిలో 1600 హెక్టర్ల భూమిలో 6 ప్రధాన బోర్లు నిర్మించారు.
- బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సుమారుగా రూ.28 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది.



కుంచంగి గ్రామంలో జగనన్న గృహం లబ్ధిదారు

- గ్రామ సచివాలయం నూతన భవనం రూ.25లక్షలు
- వెల్‌నెస్ సెంటర్ నూతన భవనం రూ.20.8 లక్షలు.
- రైతు భరోసా నూతన భవనం రూ.21.8లక్షలు.
- సీసీ డ్రైనేజీ మూలపేట గ్రామానికి రూ.12లక్షలు.
- నాడు–నేడు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి రూ.50.25లక్షలు.
- అంగన్‌వాడీ నూతన భవనాలు అభివృద్ధికి రూ.27లక్షలు.



కుంచంగి మెయిన్‌రోడ్డులో డ్రైనేజీ

- గ్రామ సచివాలయం నిధులు రూ.20లక్షలు
- క్యారీ కాలనీకి,మూలపేట, రామాలయం ఆర్‌విపాలెం వీదులకు సీసీ రోడ్లు రూ. 43లక్షలు.
- పై గ్రామాలకు డ్రైనేజీలు రూ.37లక్షలు.

అవినీతికి తావులేని ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వలంటీర్ వ్యవస్థ ద్వారా సచివాలయాలో నమోదు చేసుకుంటే అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సంక్షేమ నగదు జమ అవుతుంది. మా కుటుంబానికి సుమారుగా ప్రభుత్వం నుంచి రూ.రెండు లక్షలుగా సంక్షేమ లబ్ధిపొందాం. గతంలో ప్రతి పనికి పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ప్రస్తుతం ఇంటి వద్దనే మా పనులు మేం ఎంతో ఆనందంగా చేసుకుంటున్నాం.

– యు.అప్పారావు, కుంచంగి గ్రామం

రహదారుల అభివృద్ధి బాగుంది

అనకాపల్లి పట్టణ నుంచి కుంచంగి గ్రామానికి రావాలంటే పెద్దపెద్ద గోతులతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. గతంలో వర్షాలు పడే సమయంలో గోతుల్లో పడిపోయి క్షతగాత్రులుగా ఇబ్బందులుపడ్డాం. జగనన్న ప్రభుత్వంలో మా గ్రామానికి వచ్చే రహదారులు అన్ని అభివృద్ధి చేశారు. ఇంటింటికీ కుళాయిలు ఇచ్చారు.

–అప్పలనాయుడు, మూలపేట, కుంచంగి గ్రామం

సకాలంలో వైద్య సేవలు

గ్రామంలో ఆరోగ్య సమస్యతో బాధపడే సమయంలో ఆర్‌ఎంపీ వైద్యులను సంప్రదించి కొంత నగదు చెల్లించి మందులు తీసుకునేవారం. గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడంతో వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మాగ్రామంలో రోగులు సద్వినియోగం చేసుకున్నారు. గత ప్రభుత్వాల్లో చిన్నపాటి రోగాలకు పట్టణం పరిగేత్తేవాళ్లం. జగనన్న పాలనలో అటువంటి సమస్యలు లేవు. పాలన బాగుంది.

–లక్ష్మీప్రియ, కుంచంగి గ్రామం

16న పారిశ్రామిక సమ్మెకు పిలుపు



పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయుసి, సీపీఐ నాయకులు

తుమ్మపాల : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే పారిశ్రామిక సమ్మెను, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయుసీ పిలుపునిచ్చింది. స్థానిక సీపీఐ భవన్‌లో సోమవానరం ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఏఐటీయుసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఎస్.జె.అచ్యుతరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని సమ్మె గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూములను కార్పొరేట్‌లకు అప్పగించి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం మూడు చట్టాలు తీసుకురాగా, ఢిల్లీలో రైతులు ఆందోళన చేసి వాటిని రద్దు చేయించుకున్నారన్నారు. పోరాడి ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌తో కుదించి కార్మిక హక్కులు కాలరాయడానికి కేంద్రం ఒడిగట్టిందని ఆరోపించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని విమర్శించారు. మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, ఏఐటీయుసీ రాష్ట్ర సమితి సభ్యులు కె.సత్యాంజనేయ, పెంటకోట సత్యనారాయణ, జి.ఏసుదాసు, కె.లక్ష్మణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సీఐ వినోద్‌బాబు

కశింకోట : దొంగతనాలు, సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తతో వ్యవహరించాలని సీఐ ఎం. వినోద్‌బాబు కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం మాట్లాడారు. అపరిచిత నంబర్ల నుంచి సెల్‌ఫోన్ల ద్వారా వచ్చే మెసేజ్‌లను విశ్వసించవద్దని, ఏదో బహుమతులు, నగదు వచ్చాయని, రుణాలు వెంటనే ఇస్తామంటూ తప్పుడు మెసేజులు ఇస్తూ లింకులు క్లిక్ చేయమంటే క్లిక్ చేయరాదని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రజలకు సహకరించాలన్నారు. ఇళ్లు విడిచి వేరే ఊళ్లు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బంగారు నగలను లాకర్లలో భద్రపరచుకోవడమో, లేదా తమతో తీసుకువెళ్లడమో చేయాలన్నారు. తమ ప్రాంతానికి కొత్తవారు, అనుమానితులు, సంచార వ్యక్తులు వస్తే తమకు సమాచారం అందించాలని, వారు బంగారు వస్తువులకు మెరుగు పెడతామని వస్తే వారిని విశ్వసించి మోసపోవద్దని తెలిపారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు, వాహన చోదకులు రోడ్డుపైకి వచ్చే ముందు జాగ్రత్తగా వాహన రాకపోకలకు గమనించాలన్నారు. జాతీయ రహదారిపై లారీలు, ఇతర వాహనాలను పార్కింగ్ స్థలంలో సక్రమంగా నిలుపుకోవాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా పార్కింగ్ వాహనాల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున చోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని, ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

వైద్యసేవల్లో విప్లవాత్మక మార్పులు



వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సూరిబాబు, దిలీప్‌కుమార్, వైద్యురాలు నసరత్ సమీమ్

అనకాపల్లి : బడుగు,బలహీన వర్గాల రోగులకు వైద్యరంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. తుమ్మపాల పీహెచ్‌సీలో సోమవారం 2024–25 ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యురాలు నసరత్ సమీమ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది రూ.లక్ష 75వేల నిధులతో రోగులకు కావలసిన మౌలిక సదుపాయలు కల్పించడం జరిగిందన్నారు. వచ్చే ఏడాది మరో రూ.లక్ష 75వేలు నిధులతో రోగులకు కావలసిన సదుపాయాలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ద్వారా రోగులకు గ్రామాల్లో సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయని, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వేలాది మంది రోగులు వారివారి సమస్యలను వైద్యులు వద్ద విన్నవించుకుని మందులు ఉచితంగా తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకు ముందు తుమ్మపాల సీహెచ్‌సీ పరిధిలో 23 మంది ఫ్లోరోసిస్ రోగులకు వీల్‌చైర్లు ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి కుమారిచంద్రశేఖర్, ఫ్లోరోసిస్ వైద్యుడు ఎ.విశ్వనాథం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. 1

అర్హతే కొలమానంగా సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : అర్హతే కొలమానంగా, పార్టీలకు అతీతంగా, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీల్లో ఆ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయినుంచి నాలుగున్నర సంవత్సరాలు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 13 జిల్లాలను 26 జిల్లాలుగా ఏర్పాటు చేసి, ప్రజల వద్దకే సంక్షేమం, ప్రభుత్వ అధికారులు అనే నినాదంతో పాలన సాగిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 5.30 కోట్ల మంది ప్రజల్లో కోటి 50 లక్షల కుటుంబాలు ఉన్నాయని, 76 సంవత్సరాల స్వాతంత్య్ర పాలనలో నేటి వరకూ ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మన ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈనెల 16న చేయూత నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నేతలు సూరిశెట్టి రమణఅప్పారావు, జాజుల రమేష్, దంతులూరి శ్రీధర్‌రాజు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, జి.రామ్మూర్తి, మలసాల కిషోర్, పీలా రాంబాబు, బొడ్డేడ శివ, బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, కె.ఎం.నాయుడు, వేగి త్రినాథ్, కొణతాల మురళీకృష్ణ, కలగ గున్నయ్యానాయుడు పాల్గొన్నారు.

శివాలయంలో భక్తి సంకీర్తన



అందంగా పూలతో అలంకరించిన శివలింగం



శివాలయంలో భజన కార్యక్రమంలో భక్తులు

కశింకోట : కశింకోటలోని పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం రాత్రి తొలిసారిగా భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శివునితోపాటు దేవతా మూర్తులను స్తుతిస్తూ భక్తి కీర్తనలతో మహిళలు భజన చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వి.చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో పూలతో అందంగా అలంకరించిన శివ లింగానికి చివరిగా మంగళ హారతి ఇచ్చారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇక నుంచి ప్రతి సోమవారం భజన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

సందడిగా బల్లల పండగ



కశింకోటలోని గవరపేటలో రజకుల బల్లల పండగ ఊరేగింపు



మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట : కశింకోటలో సోమవారం రాత్రి రజకుల బల్లల పండగ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అరటి గెలలు, పూజా ద్రవ్యాలతో స్థానిక గవరపేటలోని మధ్య వీధి నుంచి ఊరేగింపు ప్రారంభించారు. మేళ తాళాలతో బాణసంచా కాలుస్తూ యువతి, యువకులు నృత్యాలు చేశారు. మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. ఊరేగింపు పెద్ద గుమ్మం వద్ద ఉన్న శారదానది ఒడ్డుకు చేరిన తర్వాత వస్త్రాలు ఉతుకుతున్న బల్లలను శుభ్రపరిచి సంప్రదాయంగా ఏటా వలే పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

ఎస్.రాయవరం : పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. అడ్డురోడ్డులో పాయకరావుపేట ఇన్‌చార్జ్ కంబాల జోగులు క్యాంపు కార్యాలయంలో సోమవారం స్థానిక విలేకర్లతో సమావేశ మయ్యారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ బలమైన పార్టీగా అవతరించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఒంటరిగా పోటీ చేసే సత్తాలేక తోక పార్టీలతో పొత్తులు పెట్టుకుని ఎన్నికలకు సిద్ధమవుతున్నారని చెప్పారు. నైతికంగా ప్రతి పక్షాలు వైఎస్సార్‌సీపీ గెలుపుని ఒప్పుకున్నారన్నారు. అయితే ఉనికిని కాపాడుకునేందుకు పోటీలో నిలుస్తున్నారన్నారు. చంద్రబాబుతో కలిసిన ఏ ఒక్కరినీ ఎదగనిచ్చే నైజం చంద్రబాబుకి లేదని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ధైర్యంగా ఓటు అడిగే హక్కు జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. చెప్పిన ప్రతి మాట నెరవేరుస్తూ ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ ఇస్తానని చెప్పి ఇవాళ నామినేషన్ వేయించారన్నారు. మాట ఇస్తే మడమ తిప్పరు అనేందుకు నిదర్శనగా మరోమారు రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షుడు చిక్కాల రామారావు, బొలిశెట్టి గోవిందరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబురాజు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: వ్యాసరచన పోటీల్లో ఎంజేపీ బీసీ బాలుర గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ వారు ఆచార్య గురు దేవోభవ అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో పాఠశాల నుంచి విద్యార్థులు టి.వెంకట అప్పారావు, ఆర్.గురుచరణ్, జి.తేజ పాల్గొన్నారు. ఈ పోటీల్లో సమాజంలో గురువు ప్రాముఖ్యతను విపులంగా వివరించారు. వారి ప్రతిభకు గుర్తింపుగా సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి అందజేశారు. ఇలాంటి వాటిలో రాణించటం వల్ల పోటీ పరీక్షలను దీటుగా ఎదుర్కోగలరన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బాబ్జి పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: సిటీ క్లబ్ ఆవరణలో అక్రమ కట్టడాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం మున్సిపల్ కమిషనర్ రవిబాబును ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆర్డీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సిటీ క్లబ్‌లో షాపుల సముదాయాన్ని నిర్మిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు స్పందనలో ఫిర్యాదు చేశారు. అక్కడికక్కడే అక్రమ నిర్మాణంపై సయుక్తంగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను, తహసీల్దారును ఆదేశించారు. శారదానగర్‌లోని పెద్ద చెరువు పంట కాలువ ఆక్రమణకు గురవుతుందని పరిసర ప్రాంత రైతులు ఫిర్యాదు చేశారు. కాలువ ఆక్రమణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆర్డీవో ఆదేశించారు. స్పందన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

నేవీ నిర్వాసితులకు చెక్కులు పంపిణీ నేడు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులకు మంగళవారం ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) చెక్కులు పంపిణీ చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్‌రాజు తెలిపారు. వాడనర్సాపురంలో ఉదయం 10 గంటలకు చెక్కులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కిషోర్‌రాజు కోరారు.

ఫార్మా మార్కెటింగ్‌లో ఎన్నో అవకాశాలు



అతిథికి జ్ఞాపికను బహుకరిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట : స్థానిక స్పెసెస్ డిగ్రీ కళాశాలలో సిస్టోపిక్ లైబోరెట్రిస్ (న్యూఢిల్లీ) సోమవారం డ్రగ్స్ సేల్స్, మార్కెటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిస్టోపిక్ లైబోరెట్రిస్ ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ సేల్స్ మేనేజర్ ఎం.వెంకటరమణ పాల్గొని బీఎస్సీ (కెమిస్ట్రీ) విద్యార్థులకు ఫార్మా డ్రగ్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్‌లో అవకాశాలు వివరించారు. కళాశాల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నతమైన స్థానాన్ని అధిరోహించాలని సూచించారు.